సాక్షి
కామారెడ్డి
బుధవారం । 30 । జూలై । 2025



అప్రమత్తంగా ఉండాలి
సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి రాధిక సూచించారు.
- 8లో ▸



నాయకులుగా తీర్చిదిద్దుతాం
వేలాది మంది ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దుతామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.7 /22.9
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కాలభైరవ స్వామిని దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్



రామారెడ్డి: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ శర్మ మేయర్ కుటుంబ సభ్యులను సన్మానించి ప్రసాదాన్ని అందించారు.

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కామారెడ్డి టౌన్ : లింగంపేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపల్ వనిత మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో చేరడానికి ఆసక్తిగలవారు గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు 79950 10656, 96407 99333 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి’



భిక్కనూరు : వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన జంగంపల్లిలోని పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

ముఖ గుర్తింపు ద్వారా చేయూత పింఛన్ల పంపిణీ



రాజంపేట: మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో మంగళవారం జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్(పెన్షన్, సదరం) శోభారాణి ఆధ్వర్యంలో చేయూత పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ ద్వారా వేలిముద్ర స్థానంలో ఫేస్ రికగ్నిజేషన్ ద్వారా పెన్షన్లను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం మురళి, ఎంవో వెంకట్రాంరెడ్డి, సిబ్బంది రవి, రాము పాల్గొన్నారు.

‘రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలి’

రుద్రూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంజూరైన వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అనువైన ప్రాంతమని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం భవనాలు, క్వార్టర్లు, ఆడిటోరియం, వసతి భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుద్రూర్ పరిశోధన కేంద్రం పరిధిలో మూడు వందల ఎకరాల స్థలం, మౌలిక వసతులు, వసతి గృహాలు ఉన్నాయన్నారు. ఇక్కడే వ్యవసాయ పాలిటెక్నిక్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలున్నాయని, శాస్త్రవేత్తలు నిరంతరం నూతన వరి, చెరుకు వంగడాల రూప కల్పనలో నిమగ్నమవుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలు వందశాతం వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు దోహదపడుతాయన్నారు. ఈ అంశాలను సీఎం, మంత్రులకు వివరిస్తానని పేర్కొన్నారు.

కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- మహిళల పేరిటే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- పదేళ్లలో బీఆర్‌ఎస్ ఒక్క రేషన్‌కార్డూ ఇవ్వలేదు
- ఓర్వలేకే ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు
- పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

దోమకొండ : మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. మంగళవారం ఆమె జిల్లాలో పర్యటించారు. దోమకొండలోని పెద్దమ్మతల్లి కల్యాణ మండపంలో దోమకొండ, బీబీపేట మండలాల్లోని లబ్ధిదారులకు నూతన ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మహిళను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో..

ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు పేద వారికి ప్రభుత్వం రేషన్ కార్డులను అందించిందని, తిరిగి ఇప్పుడే కార్డుల పంపిణీ జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. తాము ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక మాజీ సీఎం కుమారుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడన్నారు. రేషన్ కార్డు ద్వారా ఇంట్లో ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం అందుతాయని, దీని ద్వారా ఒక్క బియ్యం కోసం పెట్టే ఖర్చు ఎంత తగ్గుతుందో ఆలోచించుకోవాలన్నారు. పేదల కడుపు నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, మూడు నెలలకు సరిపడా సరుకులు ముందస్తుగానే ఇచ్చామని పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా ఉంటేనే సమాజం, కుటుంబం బాగుంటాయన్నారు. అందుకే ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, వడ్డీ లేని రుణాలు అన్నీ మహిళల పేరిటే ఇస్తున్నామన్నారు. మహిళా సంఘంలో ఎవరైనా ఆపదలో ఉంటే వారికి వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు, ప్రమాదవశాత్తు మహిళ చనిపోయే వారికి రూ. 10 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘంలో రుణం తీసుకున్న తర్వాత అకస్మాత్తుగా మహిళ చనిపోతే రుణభారం వారి కుటుంబాలపై పడకుండా ఉండేందుకు రూ. 2 లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తోందని పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలతోపాటు 15 ఏళ్లు నిండిన బాలికలకు కూడా మహిళా సంఘంలో సభ్యులుగా చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికి కార్డులను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, సుతారి రమేష్, భీంరెడ్డి, ఐరేని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు, కాంగ్రెస్ నాయకులు

ఢిల్లీలో పోరాడుతాం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం ఢిల్లీలో పోరాడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం అనంతరం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కోసం రాష్ట్రపతిని కలుస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకునే కుట్ర చేస్తోందని ఆరోపించారు. బిల్లుపై అభ్యంతరాలుంటే పార్లమెంటులో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ పేరుకే బీసీ జపం చేస్తోందని, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీని తొలగించి బీసీల గురించి మాట్లాడడం సిగ్గుచేటని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ విమర్శించారు.



మంత్రి సీతక్కకు గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

13 ఏళ్ల తర్వాత కొత్త రేషన్‌కార్డులు

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు రేషన్‌కార్డులు పంపిణీ చేశామని, తిరిగి 13 ఏళ్ల తర్వాత నూతన రేషన్ కార్డులు పేదలకు అందుతున్నాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 4 వేలపైన కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల మంజూరులో చిన్నచిన్న సమస్యలతో కొందరు ఇబ్బందులకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వారి విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్‌ను కోరారు. అనాథ పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులను, నూతన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం

- రహదారిని విస్తరించి.. ట్రాన్స్‌ఫార్మర్‌ను అలాగే వదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారులు



రోడ్డు మీద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో పాత ఎన్‌హెచ్–7 రహదారిని టేక్రియాల్ నుంచి నర్సన్నపల్లి వరకు ఆరు వరుసల రహదారిగా విస్తరించారు. మధ్యలో భారీ డివైడర్లు నిర్మించారు. అయితే పట్టణ నడిబొడ్డున పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయానికి సమీపంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం అలాగే వదిలేశారు. ఇది రోడ్డుపై ఉండడంతో ప్రమాదకరంగా మారింది. వాహనాలు వేగంగా వస్తున్నపుడు, ఓవర్‌టేక్ చేసే సమయంలో దీనిని గమనించకుంటే ప్రమాదం జరిగే అవకాశాలుంటాయి. ప్రమాదం జరగకముందే అధికారులు మేలుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

‘ట్రయథ్లాన్’ పోటీలకు భారీ స్పందన

- తరలివచ్చిన 1,300 మంది క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి పోటీలకు 37 మంది ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ట్రయథ్లాన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు భారీ స్పందన లభించింది. జూనియర్స్, సీనియర్స్ అండర్–14, 16, 18, 20, మెన్, ఉమెన్ విభాగాలలో ఎంపికలు నిర్వహించగా 1,300 మంది క్రీడాకారులు తరలి వచ్చారు. విశేష ప్రతిభ చూపిన 37 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు, జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, దేవునిపల్లి ఎస్సై అంబీర్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3, 4 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ట్రయథ్లాన్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఎంపికైంది వీరే..

కె.రాంచరణ్, బి.శ్రీవల్లిక, బి.గవస్కర్, డి.రోహిత్, ఎస్.భవాని, ఎం.రాణాప్రతాప్, ఎం.స్నేహ, ఎస్.శ్రీను, జి.జగదీష్, ఎల్.యోగి, కె.సంకేత్, కె.ఆనంద్, టి.చరణ్, ఎండీ.అఫ్రిన్, జి.రవళి, డి.అశ్విని, ఎం.అర్చన, బి.సుమలత, సీహెచ్.అరవింద్, డి.ప్రతాప్‌సింగ్, ఎం.బలరాం, ఎల్.సునీత, ఎం.హరిత, కె.నందిని, ఎం.శ్రీపతి, బి.హరిత, సీహెచ్.వంశి, జి.వసంత్‌నాయక్, పి.మధుమిత, జి.అఖిల్, బి.భరత్‌రాజ్, ఈ.అనిల్, ఎస్.రాజశేఖర్, కె.మేఘన, ఎన్.సిరి, ఎం.ఈశ్వర్, జి.పరుశురాం.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

- ఉచితంగా నారు పంపిణీకి ప్రణాళిక
- 550 ఎకరాలలో సాగుకు సాయం చేయనున్న ఉద్యాన శాఖ

కామారెడ్డి క్రైం : కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగును పెంచాలని నిర్ణయించింది. ఇందుకోసం సాగు విస్తరణ పెంచేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ – 2025 (ఎంఐడీహెచ్) పథకం ద్వారా ఆసక్తి గల రైతులకు వివిధ రకాల కూరగాయల నారును ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి జిల్లాలో 550 ఎకరాలకు సరిపడా వివిధ హైబ్రిడ్ కూరగాయల నారును రైతులకు పంపిణీ చేయనున్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు సమీపంలోని జీడిమెట్ల వద్దనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్ నర్సరీ నుంచి సరఫరా చేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచిస్తున్నారు. ఇదే కాకుండా అనేక రకాల పంటల సాగుకు సైతం ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు అందుబాటులో ఉన్నాయి.



నెల ముందే దరఖాస్తు చేసుకోవాలి

ఎంఐడీహెచ్ పథకంలో భాగాంగా కూరగాయల నారును ఉచితంగా పొందాలనుకునే రైతులు సాగుకు నెల రోజుల ముందే జిల్లాలోని ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 31 ఎకరాల్లో ఉచిత నారు కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. ఒక ఎకరంలో టమాట గానీ, వంకాయ గానీ సాగు చేయాలంటే 8 వేల మొక్కలు, మిర్చి సాగుకు 6,500 మొక్కలు అవసరం ఉంటాయి. ఈ సీజన్‌లో 200 ఎకరాల్లో ఉచిత నారు పంపిణీ చేయాలని అధికారులు యోచిస్తున్నారు. మంజూరు లభించాక రైతులు జీడిమెట్ల సెంటర్‌కు వెళ్లి తమ రవాణా ఖర్చులతో ఉచిత నారును తెచ్చుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇతర రాయితీ పథకాలు..

ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగుకు ఉచితంగా నారు ఇవ్వడమే కాకుండా ఇతర పంటల సాగుకు సైతం రాయితీలు ఇస్తున్నారు. ఉల్లి సాగు చేసే రైతులకు ఎకరానికి రూ. 8 వేల చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తున్నారు. తీగ జాతి కూరగాయలు సాగు చేయాలని భావించే రైతులకు పందిళ్లు వేసుకోవడానికి గాను ఒక్కో యూనిట్ (అర ఎకరం) కు రూ. 50 వేల వరకు రాయితీ ఇస్తున్నారు. ఇందులో జిల్లాకు 50 యూనిట్‌లు మంజూరు కాగా.. ఇప్పటివరకు 10 యూనిట్‌లకు దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. మల్చింగ్ సాగు కోసం ఒక రైతుకు గరిష్ఠంగా రెండు ఎకరాల వరకు ఎకరానికి రూ. 8 వేల చొప్పున రాయితీ లభిస్తుంది. ఉచిత నారు, పందిళ్లు, మల్చింగ్ రాయితీల కోసం తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత నారు కోసం సాగుకు నెల రోజుల ముందే దరఖాస్తులు అందజేయాలి. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నారు, ఇతర రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఏవైనా సందేహాలుంటే ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి.

– జ్యోతి, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖల అధికారి

‘సేంద్రియ వ్యవసాయం చేయాలి’

దోమకొండ : రైతులు సేంద్రీయ వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం సీతారాంపల్లిలోని వరి పంటను పరిశీలించారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద సీతారాంపల్లి ఎంపికైందని పేర్కొన్నారు. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మరల్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో భాగంగా రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలోని మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించామన్నారు. గ్రామం నుంచి కృషి సఖి పేరిట ఇద్దరు మహిళా రైతులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చామన్నారు. వారి ద్వారా మిగతా రైతులకు కూడా సేంద్రియ వ్యవసాయం మీద శిక్షణ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏడీఏ అపర్ణ, ఏవో మణిదీపిక, ఏఈవో మన్యుష, రైతులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

ఘనంగా నాగుల పంచమి



జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కామారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా మంగళవారం నాగుల పంచమిని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టలు, ఆలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలలో పాలు పోశారు. జిల్లాకేంద్రంలోని వీక్లీ మార్కెట్, రైల్వేకాలనీ, హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్‌కాలనీ, విద్యానగర్ కాలనీ, ఎన్జీవోస్ తదితర కాలనీలలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ



కామారెడ్డి టౌన్‌: హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన టీపీసీసీ సమావేశానికి జిల్లాకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌ త్వరలో రాష్ట్రంలో చేపట్టబోయే పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు.

మరోగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పెంచిన పింఛన్ల చెల్లింపు కోసం వచ్చే నెల 5న కామారెడ్డిలో చేపట్టనున్న మరోగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఇన్‌చార్జి మంథని సామెల్‌ సూచించారు. చీనూర్‌లో మంగళవారం దివ్యాంగులతోపాటు చేయూత పింఛన్‌దారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెంచిన పింఛన్‌ డబ్బుల చెల్లింపుల కోసం ఆగస్టు 13న హైద్రాబాద్‌లో 'మరోగర్జన' పేరిట సభ నిర్వహించనున్నామని చెప్పారు. సభకు సంబంధించి ఆగస్టు 5న కామారెడ్డిలో సన్నాహక సమావేశాన్ని జరుపనున్నామని, మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. నేతలు తొంట సాయిలు, కంతి పద్మారావు, మాసగల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాచారెడ్డి: సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి రాధిక సూచించారు. మంగళవారం పాల్వంచ మండలం భవానీపేట గ్రామపంచాయతీ పరిధిలోని కిసాన్‌నగర్‌లో ఆమె పర్యటించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఇటీవల డెంగీ సోకి అస్వస్థతకు గురైన వారిని కలిసి మాట్లాడారు. వైద్యాధికారి ఆదర్శ్‌, ఎంఎల్‌హెచ్‌ శ్రీకాంత్‌, ఏఎన్‌ఎం సుమలత, ఆశావర్కర్‌ ఇందిర, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పాల్గొన్న షబ్బీర్‌ అలీ, మధుయాష్కిగౌడ్‌ తదితరులు

- గిరిజనుల హక్కులను కేంద్రం హరిస్తోంది
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నగరంలో ఆదివాసీ గిరిజన కాంగ్రెస్‌ ఉమ్మడి జిల్లా శిక్షణా తరగతులు

నిజామాబాద్‌ సిటీ: దేశవ్యాప్తంగా 25 వేల మంది ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దుతామని, అందులో భాగంగానే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని హోటల్‌ హరితలో మంగళవారం నిజామాబాద్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ ఆదివాసీ గిరిజన చైర్మన్‌ కెతావత్‌యాదగిరి అధ్యక్షతన ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఆదివాసీ గిరిజన శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌ గాంధీ సూచనలతో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్‌ బొమ్మమహేష్‌కుమార్‌ గౌడ్‌ల ఆదేశాలతో తెలంగాణలో ఎస్టీలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం చర్యలతో ఆదివాసీల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌ బాధ్యత తీసుకుంటుందన్నారు.

ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌ అలీ షబ్బీర్‌ మాట్లాడుతూ.. జల్‌–జమీన్‌–జంగిల్‌ (నీరు, అటవీ, భూ వనరులు)పై గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్‌ కట్టుబడి ఉందన్నారు. గిరిజనుల అటవీ భూములు, ఇతర వనరులు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉందన్నారు.

మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌ మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారు ఆదివాసి, గిరిజనులను సరైన మార్గంలో నడిపించి రాహుల్‌ గాంధీని ప్రధానిని చేయాలన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌ మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ సూచనలతో ఇప్పటివరకు 6 జిల్లాల్లో శిక్షణా తరగతులు పూర్తిచేయగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా 7వది అని తెలిపారు. జాతీయ కన్వీనర్‌ రాహుల్‌బాల్‌, ట్రైకార్‌ రాష్ట్ర చైర్మన్‌ తేజావత్‌ బెల్లయ్య నాయక్‌, ఎస్టీసెల్‌ జిల్లా చైర్మన్‌ కెతావత్‌ యాదగిరి రాథోడ్‌, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌హందాన్‌, టీఎస్‌సీడ్స్‌ చైర్మన్‌ అవినాష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజారెడ్డి, పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌, కామారెడ్డి జిల్లా చైర్మన్‌ రాణా ప్రతాప్‌ రాథోడ్‌, నాయకులు కోటియా నాయక్‌, మల్లేశ్వరి, చంద్రకళ, గణేష్‌ నాయక్‌, వినోద్‌ నాయక్‌, నరేష్‌ నాయక్‌, సునీల్‌ జాదవ్‌, మల్లికార్జున్‌, కెతావత్‌ ప్రకాష్‌ నాయక్‌, హరినాయక్‌ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది



తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్‌ ప్రభుత్వం అన్ని రంగాల్లో భ్రష్టుపట్టించిందని, అప్పుల కుప్పగా మార్చిందని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కమీషన్ల కోసమే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పేరు మార్చి, డిజైన్‌ మార్చి కోట్ల రూపాయలు కాజేశారన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ సాగుచేయాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలంలో లాభాలు ఎక్కువగా వస్తాయని రైతులు ఆ వైపు దృష్టి సారించాలన్నారు.

కాంగ్రెస్‌ గెలుపులో గిరిజనుల పాత్ర అధికం



కాంగ్రెస్‌ పార్టీ గెలుపులో గిరిజనుల పాత్ర చాలా ఉందని, రూరల్‌ నియోజకవర్గంలో తండాలు, గిరిజనులు ఎక్కువగా ఉన్నారని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లతో సంబంధం లేకుండా గిరిజనులు సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా గెలిచేలా ఇప్పటినుంచే కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నాయకులు

'కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు'

మాచారెడ్డి: చుక్కాపూర్‌ గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం సంఘం నాయకులు మంగళవారం ఆర్డీవో వీణను కలిశారు. మాచారెడ్డి తహసీల్‌ కార్యాలయంలో తమ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని ఆమెకు తెలియజేశారు. సర్టిఫికెట్లు ఇచ్చేలా చూడాలని వినతిపత్రం అందించారు. నేతలు లక్ష్మీపతి, బాలనర్సు, రవి, నాగరాజు తదితరులున్నారు.



తెలంగాణ గర్వించదగ్గ మహాకవి సినారె

కామారెడ్డి అర్బన్‌: తెలంగాణ గర్వించదగ్గ కవి సినారె అని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్‌ శిక్షక్‌ అన్నారు. సినారె జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కర్షక్‌ బీఎడ్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సినారె రచనలను కవులు, రచయితలు కొనియాడారు. కవి సమ్మేళనంలో యెంబరి లింగం, బి.నాగభూషణం, సుధాకర్‌, సాయిప్రభ, బాలరాజయ్య, చంద్రకాంత్‌, సంధ్య తదితరులు కవితా గానం చేశారు. కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రిన్సిపల్‌ కె.విజయ్‌కుమార్‌, తెలుగు శాఖ అధ్యక్షుడు పి.విశ్వప్రసాద్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్‌ సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. నారాయణరెడ్డి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్‌ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ శంకర్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైస్‌ ప్రిన్సిపల్‌ చంద్రకాంత్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి



కామారెడ్డి టౌన్‌: మానవ అక్రమ రవాణ నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి సుర సుమలత తెలిపారు. మానవ అక్రమ రవాణా నిరోధక ప్రపంచ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ప్రతినిధులు సెమీ ఖాజాఉల్లా ఖాన్‌, ఎస్‌.గిరిజ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దొరికిన ఫోన్‌ను అందించిన యువకులు



బీబీపేట: దొరికిన ఫోన్‌ని పోలీస్‌స్టేషన్‌లో అందజేసి నిజాయతీ చాటుకున్నారు యువకులు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన షేక్‌ అయ్యూబొద్దీన్‌, హైమెద్‌హుస్సేన్‌లకు స్థానిక మసీదు వద్ద విలువైన ఫోన్‌ దొరికింది. దానిని వారు బాధ్యతాయుతంగా స్థానిక పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. పోలీసులు ఫోన్‌ను అందజేసిన యువకులను అభినందించారు. యువకులు బాధ్యతా యుతంగా ఉంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం వ్యవసాయ శాఖ ఏఈవో కిషన్‌ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ దశరథ్‌, ఎస్సై అరుణ్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో రైతులు వచ్చి దుకాణదారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని అధిక ధరలకు విక్రయించిన దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



పెద్దకొడప్‌గల్‌లో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

అభినందనలు

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి తెలంగాణ మైనారిటీ గురుకుల జూనియర్‌ కళాశాల విద్యార్థి ఎండీ అమీర్‌ జాతీయ స్థాయి గురుకులాల ఫుట్‌బాల్‌ పోటీల్లో పాల్గొన్నందుకు మైనారిటీ గురుకుల సంస్థ కార్యదర్శి షఫీవుల్లా అభినందించారు.

మంగళవారం సికింద్రాబాద్‌ జింఖానా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో అమీర్‌ను అభినందించారని ప్రిన్సిపల్‌ ఇంతియాజ్‌అలీ తెలిపారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం

- ఏఎస్పీ నర్సింహా రెడ్డి



కామారెడ్డి క్రైం: బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా కేంద్రం అండగా నిలుస్తోందని ఏఎస్పీ నర్సింహా రెడ్డి అన్నారు. అత్యాచారం, పోక్సో కేసుల్లో బాధితులుగా ఉన్న 13 మంది మహిళలు, చిన్నారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం కామారెడ్డిలోని భరోసా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం, భద్రత, మనోధైర్యం కల్పించే ఉద్దేశంతో భరోసా కేంద్రం పని చేస్తుందన్నారు. సీఐలు మురళి, సంతోష్‌ కుమార్‌, మహిళా ఎస్సై జ్యోతి, భరోసా కేంద్రం కో–ఆర్డినేటర్‌ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులు త్వరగా పూర్తి చేయాలి

బాన్సువాడ రూరల్‌: ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభించిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభించని వారు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్‌ సూచించారు. మంగళవారం ఆయన బోర్లంలో పర్యటించి ఇళ్ల పురోగతిని పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

ఒడ్డేపల్లిలో..

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఒడ్డేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో గంగాధర్‌ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఎస్టీ జాబితాలో చేర్చండి



కామారెడ్డి క్రైం: లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని లబానా లంబాడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్‌ అన్నారు. లబానా లంబాడా రాష్ట్ర సంఘం ప్రతినిధులు మంగళవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తాన్‌సింగ్‌ సాక్షితో మాట్లాడుతూ.. 1986లో లబానాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించారని తెలిపారు. వెనకబడిన తమను తిరిగి ఎస్టీ జాబితాలో కొనసాగించాలని కోరారు.

క్రైం కార్నర్‌

అమెజాన్‌ డెలివరీ హబ్‌ పేరిట సైబర్‌ మోసం

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిని అమెజాన్‌ డెలివరీ హబ్‌ పేరిట సైబర్‌ మోసగాళ్లు బురిడి కొట్టించి, రూ.లక్ష71వేలను కాజేశారు. బాల్కొండ ఎస్సై శైలెందర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మాలెం సత్యసాగర్‌కు గత నెల 27న అమెజాన్‌ డెలివరీ హబ్‌ నుంచి మాట్లాడుతున్నట్లు సైబర్‌ మోసగాళ్లు ఫోన్‌ చేశారు. బాల్కొండలో అమెజాన్‌ హబ్‌ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని అందుకు మీ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అందుకు ముందుగా రూ.17,700 చెల్లించాలని సూచించాడు. దీంతో అదే రోజు బాధితుడు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాడు. మళ్లీ ఈ నెల 15న ఫోన్‌ చేసి ఒప్పందం కోసం రూ. 28వేల 972 పంపించాలని వారు తెలుపగా, వెంటనే పంపించాడు. మెటీరియల్‌ కోసం డబ్బులు పంపమంటే ఇటీవల రూ.లక్ష 24వేలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. కొన్ని రోజుల నుంచి వరుస ఫోన్‌ కాల్స్‌ రావడంతోపాటు వారు మాట్లాడుతున్న విధానాన్ని గమనించి సైబర్‌ మోసానికి గురైనట్లు గ్రహించాడు. వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్‌ 1930కి కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం బాల్కొండ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలుశిక్ష

నవీపేట: నవీపేట శివారులో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. సదరు వ్యక్తి మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన నాగనాథ్‌ గంగారామ్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అనంతరం మంగళవారం పోలీసులు అతడిని కోర్టులో హాజరు పర్చగా, జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 26 మంది పట్టుబడ్డారు. వారికి ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ మంగళవారం కౌన్సెలింగ్‌ నిర్వహించి, జిల్లా కోర్టులోని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరు పర్చారు. జడ్జి వారిలో 22 మందికి రూ. 26 వేల జరిమానా విధించాగా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ తెలిపారు. అలాగే ఓ మైనర్‌ వాహనం నడుపుతూ పట్టుబడగా, పోలీసులు వాహన యజమానిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

నిబంధనలు పాటించని దుకాణ యజమానికి..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన షేక్‌ ఖలీమ్‌ అనే రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణం నిర్వహిస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని పోలీసులు మంగళవారం ఆర్మూర్‌ మార్నింగ్‌కోర్టు మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ ఎదుట హాజరుపర్చగా ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు.. తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ఓ బాలుడు ఇంటికి వెళ్లే దారి తెలియక తప్పిపోవడంతో పోలీసులు గుర్తించి, తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా.. మామిడిపల్లికి చెందిన ప్రణయ్‌ అనే ఐదేళ్ల బాలుడు మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి అతడు తిరిగి ఇంటికి వెళ్తుండగా దారి తెలియక జాతీయ రహదారి కూడలిలో ఏడుస్తుండగా, పోలీసులు గుర్తించారు. వెంటనే వారు బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఫొటోలను సోషల్‌ మీడియాలో పెట్టారు. కొద్దిసేపటికే బాలుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు తల్లిదండ్రుల చిరునామాను తెలియజేశారు. దీంతో మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తల్లి శిరీషకు బాలుడిని క్షేమంగా అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌ గ్రామంలో ఒకరు విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు భిక్కనూరు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మహమ్మద్‌ గౌసొద్దీన్‌ (55) మంగళవారం స్నానం చేసేందుకు తన ఇంట్లో వాటర్‌ హీటర్‌ ఆన్‌ చేయడానికి యత్నిస్తుండగా విద్యుత్‌ సరఫరా జరిగి కరెంట్‌ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ముంతాజ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి...

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్‌ కల్లు దుకాణం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. కల్లు దుకాణం సమీపంలో ఈనె 26న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని నిజామాబాద్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. అతడు గోధుమ రంగు షర్టు, ఆరెంజ్‌ కలర్‌ స్వెటర్‌, నీలి రంగు ప్యాంట్‌, తలకు ముస్లింలు ధరించే టోపీ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతుడు కూలీ పని చేసుకునేలా ఉన్నాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిసినచో వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో గాని, 8712659714కు సమాచారం అందించాలన్నారు.

తాడ్వాయిలో వృద్ధురాలి ఆత్మహత్య



సాయవ్వ (ఫైల్‌)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన ఎరుకల్ల సాయవ్వ(77) అనే వృద్ధురాలు గత యేడాది నుంచి అర్షమొలలు, వెన్ను నొప్పితో బాధపడుతుండేది. ఎన్ని ఆస్పత్రులలో చూపించినప్పటికీ నొప్పి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయవ్వ సోమవారం సాయంత్రం కాలనీలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రివేళ కుటుంబ సభ్యులు సాయవ్వ కోసం గాలించగా బావిలో మృతదేహం కనబడింది. మరుసటి రోజు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండ మండలంలో ఒకరు..

సిరికొండ: మండలంలోని మెట్టుమర్రి తండాలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన కేతావత్‌ తిరుపతి(42) అనే వ్యక్తికి నీల, గోదావరి అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం రెండో భార్యతో గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల ఆమె తన భర్తపై ధర్పల్లి పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో అతడు మద్యానికి బానిసై, మంగళవారం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మొదటి భార్యకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

బర్త్‌డే వేడుకల్లో కత్తులతో వీరంగం

- సోషల్‌ మీడియాలో వైరల్‌
- నాలుగేళ్ల క్రితం వీడియోగా పోలీసుల నిర్ధారణ!
- వైరల్‌ చేసిన వారిపై పోలీసుల ఆరా..



తల్వార్‌తో కేక్‌ కట్‌ చేస్తున్న దృశ్యం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో రౌడీ షీటర్లు బర్త్‌డే వేడుకల్లో తల్వార్‌తో కేక్‌ కట్‌ చేయడమే కాకుండా ఊరేగింపుతో హల్‌చల్‌ చేసిన వీడియో ఒకటి సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులు అప్రమత్తమై, ఆరా తీస్తున్నారు. ఈ వీడియో సోమవారం నాటిదని కొందరు చెబుతుండగా, నాలుగేళ్ల క్రితం వీడియో అని పోలీసులు నిర్ధారించినట్లు తెలుస్తోంది.

వీడియోలో ఏముందంటే..

నగరంలోని ఆటోనగర్‌లో రౌడీ షీటర్‌ ఆరిఫ్‌ గ్యాంగ్‌ సభ్యుడు అప్పు తన బర్త్‌ డే సందర్భంగా బైక్‌పై తల్వార్‌ పట్టుకొని ర్యాలీగా వచ్చారు. అనంతరం కేకను తల్వార్‌తో కట్‌ చేసి తినిపించారు. ఈ వీడియోను సోషల్‌ మీడియాలో అప్‌లోడ్‌ చేసిన వారిపై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిసింది. తల్వార్‌తో హల్‌చల్‌ చేసిన వ్యక్తిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అప్పు కోసం పోలీసుల బృందం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. నగరంలో గతంలో జంగిల్‌ ఇబ్బు అలియాస్‌ ఇబ్రహీం ఛావూస్‌, ఆరిఫ్‌ డాన్‌ వేర్వేరుగా గ్యాంగ్‌లను నడిపించారు. ఆరిఫ్‌ డాన్‌, జంగిల్‌ ఇబ్బులు మృతిచెందినా వారి అనుచరులు ఈ గ్యాంగ్‌లను కొనసాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



ఎల్లారెడ్డిరూరల్‌: పట్టణంలోని న్యూ ఆబాది కాలనీకి చెందిన అర్హాన్‌ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చినట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. బాలుడు మంగళవారం రాత్రి ట్యూషన్‌ నుంచి వస్తుండగా కుక్కలు వెంటపడి గాయపర్చాయి. ఎల్లారెడ్డి పట్టణంలో 8 మందిని కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన మరవక ముందే బాలుడిపై దాడి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసిన ఏడిళ్లలో చోరీ

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఏడు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటంతో మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని దుండగులు గ్రామంలోని మల్కి నరేష్‌ ఇంటి వద్ద సీసీ కెమెరా ఉండగా దానిపై వస్త్రం పడేసి, తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని తులం మూడు గ్రామాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. యాదుల్‌ అనే వ్యక్తి ఇంట్లో రూ.పది వేల నగదు, పదిహేను తులాల వెండి వస్తువులు, మేర గంగాదాసు ఇంట్లో రూ.4వేల నగదు ఎత్తుకెళ్లారు. మరో నాలుగిళ్ల తాళాలను ధ్వంసం చేయగా, చోరీ ఏమి జరగలేదని గ్రామస్తులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణలు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండ చిలువను చంపిన గ్రామస్తులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడికింది పల్లె శివారులో మంగళవారం సాయంత్రం స్థానికులు కొండ చిలువను చంపారు. కొండచిలువ గుర్తు తెలియని జంతువును మింగివేడయంతోనే చంపినట్లు గ్రామస్తులు తెలిపారు. కొండ చిలువ సమీపంలోని గుట్టల పైనుంచి వచ్చిందా, పెద్దవాగు శివారులో నుంచి వచ్చిందో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండ చిలువ సుమారు 8 అడుగులపైన పొడవు ఉంటుందని వారు తెలిపారు.